హెచ్‌సీయూ వీసీకి వినతి

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో గోల్డ్ మెడల్స్ పేరు మార్చాలని అఖిల భారత ఓబీసీ విద్యార్థి సంఘం సోమవారం డిమాండ్ చేసింది. ఈ మేరకు హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావుకు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఏఐఓబీసీఎస్‌ఏ హెచ్‌సీయూ కన్వీనర్ బొమ్మ ప్రవీణ్ మాట్లాడుతూ హెచ్‌సీయూలోని ఓబీసీ గోల్డ్ మెడల్‌ను 'పూలే గోల్డ్ మెడల్'గా, అలాగే ఎస్సీ/ఎస్టీ గోల్డ్‌మెడల్‌ను 'అంబేడ్కర్ గోల్డ్ మెడల్'గా మార్చాలని కోరినట్లు తెలిపారు. పూలే, అంబేడ్కర్‌లు విద్యా సాధికారత, సామాజిక న్యాయంకు మార్గదర్శకులుగా నిలిచిన మహనీయులని గుర్తు చేశారు.

నల్లగండ్లలో కార్పొరేటర్ పర్యటన


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్లలో కార్పొరేటర్ వి.గంగాధర్‌రెడ్డి సోమవారం పర్యటించారు. సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వసంతకుమార్ యాదవ్, గిరి, రమేష్, రంగస్వామి, చంద్రశేఖర్, సాయి కుమార్, క్రాంతి, శ్రీధర్, దిలీప్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శనీశ్వర జయంతి

పటాన్‌చెరు టౌన్: అమావాస్య శనీశ్వర జన్మోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 5:30 గంటల నుండి 10:00 గంటల వరకు శ్రీ రామలింగేశ్వర దేవస్థానంలో శనీశ్వర స్వామికి తైలాభిషేకం, ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ అర్చకులు మహేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏలినాటి శని, అర్ధాష్టమ శని, అష్టమ శని, శనిదోష నివారణకు పూజలు చేస్తామన్నారు.

డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించండి


జెడ్‌సీకి వినతిపత్రం ఇస్తున్న మెట్టుకుమార్

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ ను కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ సోమవారం కోరారు. అనంతరం చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి వివరించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ...ఆల్విన్ కాలనీ, సీతారాంపురం కాలనీ, గాంధీ కాలనీలలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులతో పాటు గాంధీ థీమ్ పార్క్ నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

నాలా పూడికతీత పనులు పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, ఏఈ శ్రావణి తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్ నగర్ నుంచి గురుగోవింద్‌సింగ్ కాలనీ వరకు ఉన్న ఓపెన్‌నాలా పూడికతీత పనులను సోమవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, ఏఈ శ్రావణితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వర్షాకాలం రాకముందే పనులు పూర్తి చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, ముజీబ్,రాజుగౌడ్, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్, జీహెచ్‌యంసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి లక్ష విరాళం


ఆలయ కమిటీ సభ్యులతో సాయిబాబా

రాయదుర్గం: మధురానగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ఏర్పాటుకు గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా లక్ష రూపాయలు విరాళం ఇచ్చారు. సోమవారం ఆలయ అర్చకులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలోని బృందానికి అందించారు. కార్యక్రమంలో స్థానికులు కిషోర్, అవినాష్, వినయ్, సంఘమేష్, సంతోష్, లడ్డూ పాల్గొన్నారు.

యూటర్న్‌లు.. ఇబ్బందులు

- ట్రాఫిక్ సిగ్నల్స్ మూసివేత
- ఆల్విన్ చౌరస్తా నుంచి చందానగర్ వరకు యూటర్న్‌ల వద్ద ప్రమాదాలు



చందానగర్: యూటర్న్‌లతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. మలుపుల వద్ద ప్రమాదాలబారిన పడుతున్నారు. ముంబాయి జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సంబంధిత విభాగాధికారులు మియాపూర్ ఆల్విన్ కాలనీ చౌరస్తా నుంచి చందానగర్ వరకు సిగ్నళ్లను మూసివేశారు. ఆయా చోట్ల యూటర్న్‌లు ఏర్పాటు చేయడంతో కొంతమేర ట్రాఫిక్ సమస్య పరిష్కారమైనప్పటికీ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం మలుపుల వద్ద ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మదీనాగూడ, చందానగర్, గంగారం ఏరియాలలోని యూటర్న్‌ల వద్ద ఉదయం, సాయంత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విధులు ముగించుకుని వచ్చే ఐటీ ఉద్యోగులు వాపోతున్నారు.పాదచారుల కోసం రహదారులపై జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయడంతో గతంలో పాదచారులు సాఫీగా రోడ్డు దాటేవారు. కానీ సిగ్నళ్ళు మూసివేసినప్పటి నుంచి రోడ్డు దాటాలంటే భయపడుతున్నారు.

- హఫీజ్‌పేట్, చందానగర్, గంగారం, మదీనాగూడ ప్రాంతాలలో జనాభా పెరగడంతో వాహనాల రద్దీ కూడా పెరిగింది. దీంతో రోడ్లపై యూటర్న్‌ల వద్ద ట్రాఫిక్ జామ్‌లు భారీగా నెలకొంటున్నాయి.
- ముంబాయి జాతీయ రహదారిని మియాపూర్ నుంచి చందానగర్ వరకు విస్తరిస్తున్న సందర్భంగా ట్రాఫిక్ సమస్యకు చర్యలు తీసుకోవాలి.

యాలలో భారీగా వాహనదారులు రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్ కష్టాలు వర్ణణాతీతం

- పాదచారుల కోసం జీబ్రా క్రాసింగ్‌తో కూడిన సిగ్నల్‌ను మెరుగుపర్చాలి.
- రద్దీగా ఉన్న యూ టర్న్‌ల వద్ద ప్రత్యేకంగా ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాలి.
- మలుపుల వద్ద రాంగ్‌రూట్‌లో వచ్చే వాహనాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచాలి.
- ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ప్రత్యామ్నాయ రోడ్లను గుర్తించడంతో బాటు విస్తరించాలి.

మలుపుల వద్ద ప్రమాదాలు



హఫీజ్‌పేట్ నుంచి చందానగర్ వరకు 7 యూటర్న్‌లు ఉన్నాయి. మలుపుల వద్ద రద్దీ సమయాలలో ట్రాఫిక్ కష్టాలు తీవ్రంగా ఉన్నాయి. పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ట్రాఫిక్ జామ్‌లు నెలకొనకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– కృష్ణ, మదీనాగూడ

అవసరం ఉన్నచోట సిగ్నళ్లను పునరుద్ధరించాలి



ముంబాయి జాతీయ రహదారిపై మూసివేసిన సిగ్నళ్లను పునరుద్ధరించాలి. యూటర్న్‌ల వల్ల కొంతమేర ట్రాఫిక్ సమస్య అధిగమించినప్పటికి ప్రమాదాలకు దారితీస్తుంది. పోలీస్ ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

– పురానం చౌదరి, హఫీజ్‌పేట్


చందానగర్ జాతీయ రహదారిపై యూటర్న్ వద్ద వాహనదారుల ఇబ్బందులు

ప్రజావాణి.. 12 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీసీ మోహన్‌రెడ్డి

చందానగర్: చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో సోమవారం ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7 వినతి పత్రాలు అందగా టౌన్‌ప్లానింగ్ 1, రెవెన్యూ 5, ఇంజనీరింగ్ 1 విభాగాలకు సంబంధించిన ఫిర్యాదులు రాగా వెంటనే సంబంధిత అధికారులకు సమస్యలను పరిష్కరించాలని డీసీ మోహన్‌రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీపీ నాగిరెడ్డి, డీఈ దుర్గప్రసాద్, యూబీడీ అధికారి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 5 ఫిర్యాదులు అందజేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 4, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాలకు ఒక్కొక్క ఒక దరఖాస్తు వచ్చినట్లు అధికారులు వివరించారు. కాగా ఇంటి నంబర్‌పై యజమాని పేరు మార్పు కోసం ఒకటి, నెహ్రూనగర్‌లో సీసీరోడ్డు ఏర్పాటు, శ్రీరామ్‌నగర్ కాలనీ, రాజీవ్‌నగర్, వెంకటరెడ్డికాలనీలలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేశారు.

చెత్త.. డ్రైనేజీ.. దుర్వాసన



గచ్చిబౌలి: చెత్త ,వ్యర్థాల దుర్వాసనకు తోడు డ్రైనేజీ నీరు కూడా కలవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. కొండాపూర్ డివిజన్ రాజరాజేశ్వరి కాలనీ హైటెన్షన్ రోడ్డులో సోమవారం పరిసరాలు దుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.


ప్రేమ్‌నగర్ రోడ్లపై చెత్త చెదారం

ప్రేమ్‌నగర్ బస్తీలో..

చందానగర్ : కొండాపూర్ డివిజన్ పరిధి ప్రేమ్‌నగర్ బస్తీలో రోడ్లపై చెత్త గుట్టలుగా పేరుకుపోయింది. రోజుల తరబడి చెత్తను తొలగించకపోవడంతో స్థానికులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య కార్మికులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

ప్రార్థనా స్థలాల్లో ఏర్పాట్లు చేయాలి

శేరిలింగంపల్లి: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని తగు ఏర్పాట్లు చేయాలని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడేను కోరారు. సోమవారం జోనల్ కార్యాలయంలో మైనార్టీ నాయకులతో ఆయన కమిషనర్‌ను కలిశారు. ప్రార్థనా స్థలాల్లో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని కోరారు. కాగా మంజీరా పైప్‌లైన్ రోడ్డు పనులు నాణ్యతతో పూర్తి చేయాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు.


జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకుడు జగదీశ్వర్‌గౌడ్, మైనార్టీ నాయకులు

పగలూ.. వీధి దీపాల వెలుగులు


భెల్ ఎంఐజీ కాలనీలో ..


లక్ష్మీవిహార్ ఫేజ్-1 కాలనీలో..

శేరిలింగంపల్లి: పగలు కూడా వీధిదీపాలు వెలుగుతూనే ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం భెల్ ఎంఐజీ కాలనీలో, లక్ష్మీవిహార్ ఫేజ్-1 ప్రధాన రోడ్డులో పగటి పూట స్ట్రీట్‌లైట్లు వెలుగుతున్నాయి. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నేడు శంకుస్థాపన

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని, రామ్‌నరేష్ నగర్ కాలనీలోని 12వ లైన్‌లో 35 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీవరేజ్ లైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు మంగళవారం సాయంత్రం 4 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు.

ఆత్మీయ సన్మాన సభ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బదిలీ అయిన పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డికి ఆదివారం రాత్రి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో రామచంద్రాపురం శ్రీ కన్వెన్షన్‌లో ఆత్మీయ సన్మాన సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ సంజీవ్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని, వారు చేసిన సేవలు గుర్తు పెట్టుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధ, ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు పాల్గొన్నారు. అనంతరం డీఎస్పీ రవీందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

18 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం నిర్వహించిన డ్రైవ్‌లో 18 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికి రూ.2 వేల జరిమాన, మరో ఇద్దరికి రూ. వెయ్యి, 14 మందికి రూ.1500 చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ప్రయాణికుడికి బ్యాగు అందజేత

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్ రమేష్

మియాపూర్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు మరిచిపోయిన బ్యాగులో రూ.3.5లక్షల విలువచేసే వస్తువులను ఆర్టీసీ మియాపూర్- 2 డిపో డ్రైవర్ రమేష్ ఆ ప్రయాణికుడికి అందజేసి నిజాయితీని చాటుకున్నాడు. వివరాలు ఇలా.. జేఎన్‌టీయూకు చెందిన అల్లూరి చిట్టిబాబు ఆదివారం శంషాబాద్ నుండి పుష్పక్ బస్సులో వచ్చాడు. జేఎన్‌టీయూ వద్ద బస్సు దిగే సమయంలో బ్యాగు మర్చిపోయి వెళ్లాడు.కొద్దిసేపటి తర్వాత బస్సు డ్రైవర్ రమేష్ బ్యాగును గమనించి డిపో అధికారులకు అందజేశారు. ఆ బ్యాగును పరిశీలించగా అందులో రూ.3.5 లక్షల విలువచేసే బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్, విద్యా ధ్రువపత్రాలు, వ్యాలెట్ గమనించారు. అధికారులు ప్రయాణికుడు చిట్టిబాబు సమాచారం కనుగొని సోమవారం మియాపూర్-2 డిపోలో మేనేజర్ వెంకటేశం అధికారులతో కలిసి చిట్టిబాబుకు బ్యాగును అందజేశారు. డ్రైవర్ రమేష్‌ను అభినందించి శాలువా కప్పి సన్మానించారు.

టిప్పర్ లారీ ఢీకొని యువకుడు మృతి

మియాపూర్: జాతీయ రహదారిపై టిప్పర్ లారీ ఢీకొనడంతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం...వరంగల్ జిల్లా బంజారాపల్లికి చెందిన అల్వాబోజు కోటేశ్వర్(27) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. చందానగర్‌లో కుటుంబంతో నివాసముంటున్నాడు. ఆదివారం ఉదయం 10.30 గంటల సమయంలో కోటేశ్వర్ అమీర్‌పేట్‌లో ఉంటున్న చిన్నాన్న కుమారుడు శ్రీకాంత్‌ను కలవడానికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. తిరిగి సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు అమీర్‌పేట్ నుండి చందానగర్‌కు బయల్దేరాడు. ఈ క్రమంలో మియాపూర్ ఆల్విన్ క్రాస్ రోడ్డు సిగ్నల్ వద్ద హఫీజ్‌పేట్ నుండి ఆల్విన్ క్రాస్ వైపునకు వస్తున్న టిప్పర్ లారీ అతివేగంగా వచ్చి కోటేశ్వర్‌ను ఢీకొంది. దీంతో కోటేశ్వర్ కిందపడగా తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. టిప్పర్ లారీ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడు సోదరుడు అరవింద్ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అదనపు అంతస్తుల కూల్చివేత

మణికొండ: అనుమతులకన్నా అధికంగా నిర్మించిన అంతస్తులపై మణికొండ మున్సిపాలిటీ అధికారులు కొరడా ఝులిపించారు. మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీలో ఓ బిల్డర్ జీ ప్లస్ నాలుగు అంతస్తులకు అనుమతులు తీసుకుని ఏకంగా ఆరు అంతస్తులు నిర్మిస్తున్నారు. రెండు సార్లు నోటీసులు ఇచ్చినా పట్టించుకోకపోవటంతో సోమవారం మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్ అధికారి సంతోష్‌సింగ్ రెండు అంతస్తుల స్లాబ్‌లను కట్ చేసి కూల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తీసుకున్న అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలన్నారు. అదనంగా నిర్మించినా.. సెట్‌బ్యాక్‌లు లేకపోయినా చర్యలు తప్పవన్నారు. రాబోయే రోజుల్లో చర్యలు తీసుకునేందుకు మరి కొన్ని భవనాలను గుర్తించామని, వాటిపైనా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో భారీ వర్షం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాదాపు అర గంట పాటు కురిసిన వర్షానికి ప్రధాన రహదారులతో పాటు అంతర్గత బస్తీల్లో వరదనీరు ఏరులై పారాయి. ప్రధానంగా ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి, మైలార్‌దేవ్‌పల్లి, బుద్వేల్ అండర్ గ్రౌండ్ బ్రిడ్జి, గగన్‌పహాడ్, యూనివర్సిటీ రోడ్డు, ఉప్పర్‌పల్లి, శివరాంపల్లి, హైదర్‌గూడ, అత్తాపూర్, రాజేంద్రనగర్, ఎన్ఐఆర్‌డీ, బుద్వేల్, నేషనల్ పోలీసు అకాడమీ ప్రాంతాలలో రహదారులపై వరదనీరు నిలిచిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. వరదనీరు తగ్గుముఖం పట్టిన అనంతరం రాకపోకలు సాగాయి. కొన్ని ప్రాంతాల్లో వరదనీరు నిలిచిపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ పాలనలోనే పేదలకు న్యాయం

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: పేదలకు అన్ని రంగాలలో మేలు చేసే ఉద్దేశంతో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రభుత్వం ఇచ్చే పథకాలతో వారంతా లబ్ధిపొందాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపల్ పరిధిలోని కోకాపేట కమ్యూనిటీ హాల్‌లో సోమవారం ఆయన 238 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ గృహ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలలో భాగంగా స్థలాలు ఉన్న వారికి ఇందిరమ్మ గృహాలను నిర్మించుకునేందుకు రూ. 5 లక్షలను ప్రభుత్వం ఇవ్వటం శుభపరిణామన్నారు. ఎలాంటి రుణం కాకుండా ఉచితంగా ఇంటి నిర్మాణానికి డబ్బు ఇవ్వటం పేదలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటి వరకు ఇందిరమ్మ గృహాలు రాని వారు ఉంటే తిరిగి దరఖాస్తు చే సుకోవాలని, వారికి మంజూరయ్యేలా చూస్తామన్నారు. మంజూరైన వారంతా ఆరు నెలల్లోపు ఇళ్లను నిర్మించుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఎలా ఉన్నా కొంత మేర సడలింపులు అధికారులు ఇస్తారని, వాటిని ఉపయోగించుకుని ఇంటి స్థలం పెద్దగా ఉన్న వారు అదే స్థాయిలో నిర్మాణం చేసుకోవాలన్నారు. నార్సింగి మున్సిపాలిటీలో అధికారులు ఉత్తమంగా పనిచేస్తున్నారని, వారికి ప్రతి ఒక్కరూ సహకరించి మన వార్డులను మరింతగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. పనిచేసే అధికారులను విమర్శించటం మానుకోవాలని సూచించారు. గత 15 నెలల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని, వాటితో లబ్ధిపొందిన వారు ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. ముఖ్యమంత్రికి పేదల కష్ట, సుఖాలు తెలుసు కాబట్టే ఇలాంటి పథకాలను వారికి అందిస్తున్నారన్నారు. నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం.జైపాల్‌రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్‌లతో పాటు మాజీ కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ఎందుకింత నిర్లక్ష్యం?


తెల్లాపూర్ సబ్‌స్టేషన్

సబ్‌స్టేషన్ మంజూరై ఏడు సంవత్సరాలు

- అసంపూర్తిగా నిర్మాణం
- ప్రజలకు తప్పని కరెంట్ కష్టాలు

రామచంద్రాపురం, (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నూతన సబ్‌స్టేషన్ మంజూరై ఏడేళ్లు గడుస్తున్నా నేటికీ ప్రజలకు అందుబాటులోకి రాకపోవడంతో స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏడు సంవత్సరాల్లో మున్సిపాలిటీ పరిధిలో అనేక నూతన కాలనీలు వచ్చాయి. కానీ నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయటంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్‌స్టేషన్ నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో ఇక్కడ ప్రజలకు విద్యుత్ సమస్య తప్పడం లేదు.


2019లో సబ్‌స్టేషన్ మంజూరు..

మున్సిపల్ పరిధి విద్యుత్‌నగర్‌లోని సబ్‌స్టేషన్ నుంచి పలు కాలనీలకు విద్యుత్ సరఫరా అవుతుంది. మున్సిపల్ పరిధిలో అనేక కాలనీలు రావటంతో సమస్యలు అధికమయ్యాయి. దీంతో 2019లో తెల్లాపూర్‌కు నూతన సబ్‌స్టేషన్‌ను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది.

భూకేటాయింపు.. నిధులు మంజూరు

సబ్‌స్టేషన్ మంజూరు చేసి నిర్మాణం కోసం గత ప్రభుత్వం మూడేళ్ల క్రితం 30 గుంటల భూమిని కేటాయించింది. సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం రూ.4కోట్లు నిధులను మంజూరు చేశారు. అయినా సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు నత్తనడకన సాగడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రామచంద్రాపురం పట్టణంలో సబ్‌స్టేషన్ నిర్మాణం నెలరోజుల్లో పూర్తి చేయగా ఇక్కడ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిత్యం అధికారులు వివిధ కారణాలతో విద్యుత్ కోత విధిస్తున్నారని.. ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు మండిపడుతున్నారు.

పనులు పూర్తి చేయండి



సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను అధికారులు ఎందుకు వేగంగా చేయడం లేదో అర్థం కావడం లేదు. దీనిపై పాలకులు ప్రత్యేక దృష్టి సారించాలి. తర్వగా స్టేషన్‌ను వినియోగంలోకి తీసుకోస్తే ప్రజలకు కష్టాలు తొలగిపోతాయి.

– రవికుమార్, ఇంద్రానగర్

త్వరలోనే వినియోగంలోకి..

వేసవిలో విద్యుత్ సమస్యలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. త్వరలో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి చేసి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకుని వస్తాం.

– బాలకృష్ణ, ఏఈ